# పోనీ-రేపన్నా చెయ్యరా!

## -కోలపల్లి ఈశ్వర్

''పోనీ రేపైనా చెయ్యరా!'' అన్నాడాంజనేయులు-సలహా ఇస్తున్న ధోరణిలో.

''రేపా?!'' అచ్యుత్ ఆముదం తాగిన వాడిలా ముఖం పెట్టాడు.

''అబ్బే..నా వల్లకాదు'' అన్నాడు అడ్డంగా తలాడిస్తూ.

''ఏం-ఎందుకు వల్లకాదు? నువ్ మగాడివి కావా? లేక అంత ధైర్యం లేదా?'' రెచ్చగొట్టి పౌరుషాన్ని రేకెత్తిస్తే గురుడు దార్లోకొస్తాడన్న ఆశతో అలా అన్నాడాంజనేయులు.

కానీ అచ్యుత్ రెచ్చిపోలేదు.

అలాగని అతనిలో పౌరుషం లేదని కాదు. ఉంది. కావాల్సినంత వుంది. కానీ అంతకు మించిన ఇంగిత జ్ఞానం కూడా ఉన్నవాడు కావటం వల్ల, మిత్రుడంత మాటన్నా కూడా అతను ప్రశాంతంగానే ఉండగలిగాడు.

''నువ్వెలాగైనా అనుకో. కానీ నేను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపాడు పని చెయ్యను.'' అన్నాడు ఏమాత్రం ఉద్రేకం చెందకుండా.

'' చెయ్యకపోతే-నీ మాలతి నీకింక దక్కదు కాక దక్కదు'' బెదిరించాడు ఆంజనేయులు. ''అయినా ఇందులో అంత సంకోచించాల్సిందేముందీ? ఏ విషయాన్నైనా సామ దాన బేధ దండోపాయాల్తో పరిష్కరించు కోవాలంటారు పెద్దలు. నీ ప్రేమ విషయంలో మొదటి మూడూ ఫలించ లేదు ఇక మిగిలింది దండోపాయం ఒక్కటేగా? నా మాట విని నేను చెప్పినట్టు చెయ్. నీ ప్రేమ తప్పకుండా ఫలిస్తుంది..''

మిత్రుడి మాటల్లో వాస్తవమున్నట్టుగానే అనిపించినా-ఎందుకో గాని వాటిని జీర్ణించుకోలేక పోయాడు అచ్యుత్

ఎందుకో ఏమిటీ?-ఇంగితం ఉన్న వాళ్లెవ్వరూ తొందరపడి అకృత్యాలు చెయ్యరు.

ఆమాటే అన్నాడతను మిత్రుడితో... ''నువ్ చెప్పింది నిజమే. అయినా అలాంటి పాడు పని చెయ్యటానికి నా మనసంగీకరించట్లేదురా'' అని.

''ఇందులో పాడేముంది? చూస్తూ ప్రేయసిని చేజార్చుకునే కన్నా ఇట్ట అడ్డదారి తొక్కడమే సబబు. నడిచింది ఏదారిలో అన్నది కాదు పాయింటు. గమ్యం చేరుకోవడమే ప్రధానం'' అంటూ ప్రలోభపెట్టబోయాడు ఆంజనేయులు. కానీ ''వక్రమార్గాలు నాకిష్టం లేదురా'' అంటూ అచ్యుత్ అతనికి మధ్యలోనే అడ్డుపడ్డాడు.

''ఐతే నీ ఖర్మ! మంచీ చెడూ అని ఆలోచిస్తూ నువ్విలాగే నానుస్తూ కూర్చుంటే నీ మాలతి పరాధీనమయి పోతుంది! ఆ తర్వాత నీకు మిగిలేది నెత్తిన చెంగే....'' ఆంజనేయులు మళ్లీ బెదిరించాడు.

ఈసారి అచ్యుత్ కొద్దిగా మెత్తబడ్డాడు.

''పోనీ రేపు చేసేస్తే పోలా?'' అనుకున్నాడు.

కానీ అంతలోనే అతని మనసు ''తప్పు తప్పు'' అంటూ మళ్లీ అతన్ని హెచ్చరించింది. దాంతో ''సారీరా! మొన్నేదో తొందరపడి నీ సలహాకి ఊ కొట్టానే తప్పు.....మాలతికి నేనంత ద్రోహం చెయ్యలేను...'' అన్నాడు కుడిచేత్తో కణతలు రుద్దుకుంటూ.

''ఇది ద్రోహం ఎలా అవుతుందిరా? ఏం చేసినా ఆమె మీద ప్రేమకొద్దే కదా!? ఆమెని దక్కించుకోవాలనే కదా?!''

''అవుననుకో...''

''అవునంటూనే మళ్లీ ఆ నసుగుడు దేనికిరా? దేనికైనా ధైర్యం ఉండాలి. మా వీధిలో సురేష్ అని ఒకబ్బాయున్నాడు. నీలాగే నీరజ అనే ఒకమ్మాయిని ప్రేమించాడు. కానీ ఆ అమ్మాయి అతని ప్రేమని అంగీకరించ లేదు. దాంతో-ఎలాగైనా ఆమెని దక్కించుకోవాలన్న పట్టుదలతో-ఒక రోజు అతనామెని రేప్ చేశాడు. దాంతో కేసు పెట్టి అల్లరిపాలయ్యే కన్నా ఆ పిల్లని అతనికే కట్టబెడితే మేలనుకున్నారు ఆమె తల్లిదండ్రులు. ఫలితంగా అతని మనోభీష్టం నెరవేరి ఆమె అతనికి భార్య అయింది!సో...ఒక్కోసారి వక్రమార్గాలే మనల్ని సక్రమంగా గమ్యం చేరుస్తాయ్....''

''షటప్!''

ఆంజనేయులు ఉలిక్కిపడ్డాడు.

ఎందుకంటే షటప్పన్నది అచ్యుత్ కాదు. వాళ్ల హౌసోనర్ పెంచలయ్యగారు.

''సార్ మీరా?!''

''అవున్నేనే...ఏం కనబడ్డంలా?! అది సరేగానీ ఏంటయ్యా నీ ఫ్రెండ్‌కేదో నూరి పోస్తున్నావ్?'' అన్నాడాయన అచ్యుత్ కేసి అదోలా చూస్తూ.

''అయితే మీరంతా వినేశారన్నమాట! ఏం లేస్సార్..వీడొక అమ్మాయిని ప్రేమిస్తున్నాడు..'' అంటూ ఆంజనేయులింకా ఏదో చెప్పబోతుంటే-''ఆపు! మిగతాది నే చెబుతాను.'' అంటూ అతన్ని వారించి చెప్పుకు పోయాడు పెంచలయ్యగారు. ''మీవాడొక అమ్మాయిని ప్రేమించాడు గానీ ఆ అమ్మాయి మాత్రం మీ వాడ్ని ప్రేమించలేదు. పైగా ఛీ కొట్టి ఉంటుంది? అందుకేగా నువ్విప్పుడీ తప్పుడు సలహా ఇస్తుంది? ఆడదాని మనసు ప్రేమతో గెల్చుకోవాలయ్యా? అంతేగాని ఆమెని రేప్ చేసి దారికి తెచ్చుకోవడం మగతనం అన్పించుకోదు. అయినా ఆ సురేష్ ఎవడి విషయంలోనో రేప్ చేస్తే పెళ్లయిందనీ అందరికీ అలాగే జరుగుతుందను కోకు. ఆ మాలతి గనక కేసు పెట్టిందంటే మీవాడెళ్లి బొక్కలో కూర్చుంటాడు! ఛీ, ఫ్రెండువీ రూమ్మేటువీ అయ్యుండి ఇలాంటి సలహాలటయ్యా ఇస్తావు?! థూ!''

ఆయన తన వైపు ఏహ్యంగా చూస్తుంటే ఆంజనేయులు బిక్కచచ్చిపోయాడు.

అచ్యుత్ కూడా ఆశ్చర్యపోయాడాయన మాటలకి.

''సార్ ఏంటి మీరంటున్నది?!! మాలతిని రేప్ చెయ్యమని నేను వాడికి దుర్బోధ చేస్తున్నానా!..లేదు సార్ లేదు! మీరు చాలా మిసండర్‌స్టాండ్ చేసుకున్నారు!'' అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు ఆంజనేయులు.

''ఎందుకయ్యా బుకాయిస్తావు? నేనంతా చెవులారా విన్నాను!'' అంటూ అతనికి మధ్యలోనే అడ్డుపడ్డాడు పెంచలయ్యగారు.

''మీరు మా సంభాషణ ఎక్కణ్ణుంచి విన్నారు సార్?'' అచ్యుత్ కలుగ జేసుకుంటూ అడిగాడు.

''పోనీ రేపైనా చెయ్యరా అని మీ ఫ్రెండంటుంటే-నువ్ నావల్ల కాదురా అంటుండగా వచ్చాను..'' చెప్పాడు పెంచలయ్య గారు.


''అదీ సంగతి! అందుకే మీరు అపార్థం చేసుకున్నారు'' తాపీగా అన్నాడు అచ్యుత్.

''అపార్థమా?'' అంటే? అన్నట్లుగా చూశాడు పెంచలయ్యగారు.

''అవున్సార్! నేను మాలతి అనే అమ్మాయిని ప్రేమించాను. తను కూడా నన్ను ప్రేమించింది. కానీ మా పెళ్లికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. నాది వాళ్ల కన్నా తక్కువ కులం అన్న ఉద్దేశ్యంతో..''

''అందుకని ఆ అమ్మాయిని రేప్ చెయ్యమని సలహా ఇస్తున్నాడా నీ ఫ్రెండు?!''

''ఛ ఛ లేదుసార్! వాడు 'పోనీ రేపైనా చెయ్యరా' అన్నది నేనింకా పోస్ట్ చెయ్యని ఓ ఉత్తరం గురించి...''



''ఉత్తరమా?!!'' ఆశ్చర్యంగా చూశాడు పెంచలయ్య.

''అవున్సార్! మాలతి నాతో ప్రేమలో పడిందని తెలిసి వాళ్ల అమ్మానాన్నలు ఆమెకు సంబంధాలు చూడ్డం ప్రారంభించారు. ఈమధ్యనే ఒకబ్బాయి ఆమెని చూసి వెళ్లాడు. అమ్మాయి నచ్చిందని పెళ్లి చూపుల్లోనే చెప్పి, ముహూర్తం గురించి తర్వాత రాస్తాం అంటూ వెళ్లారట. ఈ సంగతి మాలతి నాతో చెప్పుకుని ఏడిస్తే నేను ఏదైనా సలహా చెప్పమని వీణ్ణి అడిగాను. మాలతి నాకు రాసిన లౌ లెటర్స్‌ని అతనికి పోస్ట్ చేసి ఆ సంబంధం చెడగొట్టమని వీడు సలహా ఇచ్చాడు. సరేనంటూ నేను ఆ వరుడికి ఓ ఉత్తరం రాసి, దానికి రెండు లౌ లెటర్స్ కూడా జోడించి ఆ రోజే కవర్లో పెట్టి అడ్రసు కూడా రాసేశాను. కానీ దాన్ని పోస్ట్ చెయ్యలేదు'' అంటూనే బల్లదగ్గరకు వెళ్లి పేపర్ వెయిట్ క్రిందున్న ఓ కవర్ని తీస్కొచ్చి పెంచలయ్య గారికి చూపించాడు అచ్యుత్.

దాంతో ఆయనకి విషయం అర్థమైంది.

''ఎందుకని పోస్ట్ చెయ్యలేదో?'' అడిగాడు కుతూహలంగా.

''ఎందుకో నాకది తప్పనిపిస్తోంది సార్!'' అన్నాడు అచ్యుత్.

''తప్పెలా అవుతుందయ్యా? గత్యంతరం లేనప్పుడు కొన్ని కొన్నిసార్లు అడ్డదార్లు తొక్కాలి తప్పదు. బాగా పొద్దు పోయినట్టుంది..ఇవ్వాళ ఏం పోస్ట్ చేస్తావ్ లే గానీ- పోనీ రేపైనా చెయ్యి'' అన్నాడు. పెంచలయ్య గారు.

అచ్యుత్ ''అలాగే సార్!'' అని నిలువుగా తలాడిస్తుంటే.

''థాంక్స్ సార్! మీ రాకతో ఓ ప్రోబ్లెం సాల్వ్ అయింది'' అన్నాడాంజనేయులు ఆనందంగా.

అతనికి సారీ చెప్పాలనిపించినా, పెంచలయ్యగారు నవ్వి ఊరుకున్నాడంతే!

★